కట్టు కట్టేస్తారు.. కాకినాడ పంపేస్తారు..

- యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో కానరాని వైద్యం
- రిఫర్ చేయడానికే పరిమితమవుతున్న సిబ్బంది
- పని చేయని సీటీ స్కాన్, ఎక్స్‌రే మిషన్లు

యానాం: 142 ఏళ్ల చరిత్ర.. వంద పడకల ఆసుపత్రి.. 250 మంది సిబ్బంది.. వారి కోసం నెలకు రూ.2 కోట్ల జీతాల బడ్జెట్.. ఆసుపత్రి నిర్వహణకు ఏడాదికి సుమారు రూ.36 కోట్ల ఖర్చు.. అయినా అక్కడి వైద్య సిబ్బంది మాత్రం ×ఒక్కొక్కరిగా వచ్చినా సరే.. వందల మంది వచ్చినా సరే..₹ వచ్చినవారిని వచ్చినట్టుగా కాకినాడ ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేయడమే పనిగా పెట్టుకున్నారు. యాక్సిడెంట్ కేసుల్లో ఎవరైనా తీవ్ర గాయాలతో వచ్చినా సరే కట్టు కట్టేసి కాకినాడ వెళ్లిపోమంటూ పంపేస్తున్నారు. ఫలితంగా సామాన్య ప్రజలకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. ఇదీ యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న దుస్థితి.. వారి రిఫర్‌ల కారణంగా అత్యవసర పరిస్థితుల్లో మార్గం మధ్యలోనే ప్రాణాలు కోల్పోతున్న ఘటనలూ చోటుచేసుకుంటుండడంపై సామాజికవేత్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యానాం ప్రభుత్వాసుపత్రికి 142 ఏళ్ల చరిత్ర ఉంది. 1882లో ఆరు పడకల ఆసుపత్రిగా ప్రారంభమైంది. అనంతరం 1948లో 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. 2005లో 100 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దారు. జనరల్ సర్జరీ, పీడియాట్రిక్, గైనకాలజీ, ఈఎన్‌టీ, రేడియాలజీ, ఫిజియోథెరపీ విభాగాల వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. అంతేకాదు ఆపరేషన్ థియేటర్, అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్‌ను సైతం ఏర్పాటు


యానాం ప్రభుత్వ ఆసుపత్రి

చేశారు. అయితే గత నాలుగేళ్లుగా సిటీ స్కాన్ పనిచేయడం లేదంటూ గాలికొదిలేశారు. ఎక్స్‌రే మిషన్ సైతం పనిచేయడం లేదని రోగులను బయటకు పంపేస్తున్నారు. ఆఖరికి గాయపడి వచ్చినవారిని సైతం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశామంటూ చీటీ చేతిలో పెడుతున్నారు. మార్చురీ గది ఉన్నా అక్కడ మృతదేహాలను భద్రపరిచే ఫ్రీజర్ గత 7 నెలలుగా పనిచేయడం లేదు. దీంతో మృతదేహాలను వారి బంధువులే సొంత ఖర్చుతో బయటి నుంచి ఫ్రీజర్ బాక్సులను తెచ్చుకుని భద్రపరుచుకోవాల్సిన దుస్థితి పట్టించారు.

శస్త్రచికిత్సలు కల్లే

యానాం ప్రభుత్వాసుపత్రికి ప్రభుత్వం ఏటా కోట్లాది రూపాయల బడ్జెట్ కేటాయిస్తుంది. ఇక్కడ 61 మంది నర్సులతో కలిపి ఏకంగా 250 మంది


ఏళ్లుగా మూతబడి ఉన్న సీటీ స్కాన్ గది

సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రతి నెలా వారి జీతాలకే రూ.2 కోట్ల బడ్జెట్ ఇస్తున్నారు. మరోవైపు జీజీహెచ్‌లో మత్తు వైద్యుడు లేని కారణంగా శస్త్రచికిత్సలు నిలిచిపోయాయి. ఆఖరికి గైనకాలజిస్ట్ ఉన్నా సరే అత్యవసర పరిస్థితుల్లో వస్తున్న గర్భిణులను సైతం మత్తు వైద్యుడు లేడన్న కారణాన్ని చూపిస్తూ కాకినాడ వెళ్లిపోవాలంటూ పంపేస్తున్నారు. ఈఎన్‌టీ వైద్యుడున్నా ఆయన కాకినాడలో మకాం వేయడంతో సకాలంలో అందుబాటులో దొరకడం లేదన్న విమర్శలున్నాయి. పీడియాట్రిక్ విభాగమైతే ఉంది కాని డాక్టర్ లేరు. దీంతో చిన్నారులకు వైద్యం అందడం లేదు. మొత్తంగా ఒక్క ముక్కలో చెప్పాలంటే యానాం ప్రభుత్వాసుపత్రిలో శస్త్రచికిత్సలు జరగడం కల్లగానే మిగిలిపోయింది. కేవలం కట్లు కట్టడానికే ఆసుపత్రి ఉందన్న చందంగా అక్కడి వైద్య సిబ్బంది వ్యవహరిస్తున్నారు. మరోవైపు అక్కడి సిబ్బందిలో చాలామంది క్వాలిఫైడ్ కాదని, దొంగ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు తెచ్చుకున్నారన్న విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే కనీస ప్రాథమిక వైద్యం అందించడం సైతం చాలామంది సిబ్బందికి రావడం లేదంటున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను



వైద్యుల నియామకం కోసం చాలాసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాను. ఇప్పటి వరకూ నియామకం జరగలేదు. మత్తు వైద్యుడు, పీడ్రియాటిక్ వైద్యుడు లేరు. మౌలిక సౌకర్యాల ఏర్పాటు చేయమంటూ లేఖ రాశాను.

– టి.రవిశంకర్, డిప్యూటీ డైరెక్టర్, జీజీహెచ్, యానాం

క్లుప్తంగా

10న గోడి గురుకుల ప్రవేశ పరీక్ష

అల్లవరం: మండలంలోని గోడి బాలుర గురుకులంలో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు ఈ నెల 10 న గురుకులంలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతికి ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ, ఇంటర్మీడియెట్‌కు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 97045 50038, 83740 26639 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

రమేష్‌బాబుకు పరామర్శ

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మేడిద రమేష్‌బాబును రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు సోమవారం రాత్రి పరామర్శించారు. రమేష్‌బాబు అనారోగ్యంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక కొంకాపల్లిలోని రమేష్‌బాబు ఇంటికి శేషుతో పాటు కాపు కార్పొరేషన్ డైరెక్టర్లు వెళ్లి ఆయనను పరామర్శించారు.

13 నుంచి కంటి శస్త్ర చికిత్సలు

యానాం: పుదుచ్చేరి ఆరోగ్య శాఖ ద్వారా ఈ నెల 13, 14, 15 తేదీల్లో యానాం జీజీహెచ్ వద్ద ఉచిత కంటి శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు డీడీ టి.రవిశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యానాం, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రేషన్, ఆధార్, ఆయుష్మాన్ భారత్ కార్డులను తీసుకొచ్చి జీజీహెచ్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కంటి శస్త్రచికిత్స కోసం ఈ నెల 12వ తేదీలోగా జీజీహెచ్‌లో ఉచిత రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

మంత్రివర్గంలోకి తిరుమురుగన్


తిరుమురుగన్

యానాం: పుదుచ్చేరి మంత్రివర్గంలోకి కారైకల్ నార్త్ నియోజకవర్గ ఎన్ఆర్‌కాంగ్రెస్ శాసనసభ్యుడు తిరుమురుగన్‌కు చోటు కల్పించారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ జాయింట్ సెక్రటరీ అసుతోష్ అగ్నిహోత్రి మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. నెడుంగాడు నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రి చంద్ర ప్రియాంక గతేడాది రాజీనామా చేసిన నేపథ్యంలో ఆమె స్థానంలో తిరుమురుగన్‌కు చోటిచ్చారు. ఈ నెల 7న ఆయన ప్రమాణ స్వీకారం ఉంటుందని భావిస్తున్నారు.

పరమశివునికి అభిషేకం

అమలాపురం రూరల్: మండలంలోని ఇందుపల్లి బాల భక్త గణపతి సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన శివరాత్రి సందర్భంగా 146 అంతర్వాహిని కోనేరు, నది, ఉప నది నుంచి సేకరించిన జలాలతో అభిషేకం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు టీకే విశ్వనాథ్ మంగళవారం తెలిపారు.

సాగులో చీడపీడల నివారణపై సదస్సు

యానాం: స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో సాగులో నూతన సాంకేతిక పద్ధతుల వినియోగం, చీడపీడల నివారణపై అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఆర్ఏఓ మునిస్వామి అధ్యక్షతన మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు అడిగిన పలు అనుమానాలను నివృత్తి చేశారు. దరియాలతిప్ప, కనకాలపేట, పరంపేట, దొమ్మేటిపేట తదితర గ్రామాల నుంచి రైతులు హాజరయ్యారు. కార్యక్రమంలో డీడీ శివసుబ్రహ్మణ్యం, వ్యవసాయాధికారి చిక్కాల జోగిరాజు, ఫీల్డ్‌మెన్ ఐకే ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో షాపు దగ్ధం


అగ్ని ప్రమాదంతో కాలిపోతున్న బెలూన్స్ డెకరేషన్ షాపు

అమలాపురం టౌన్: స్థానిక గోఖలే సెంటరులో ఉన్న అన్‌లిమిటెడ్ బెలూన్స్ డెకరేషన్, గిఫ్ట్స్ షాపు షార్ట్ సర్క్యూట్ కారణంగా మంగళవారం సాయంత్రం దగ్ధమైంది. అమలాపురం అగ్నిమాపక దళం వచ్చి మంటలను అదుపు చేసింది. అగ్నిమాపక అధికారి కేవీ మురళీ కొండబాబు ఆధ్వర్యంలో సిబ్బంది జరిగిన నష్టాన్ని అంచనా వేశారు. షాపులోని ఏసీ, సీలింగ్, డెకరేషన్‌కు సంబంధించిన బెలూన్స్ ఎక్విప్‌మెంట్ మంటల్లో కాలిపోయాయి. ప్రమాదంలో రూ.8 లక్షల వరకూ ఆస్తి నష్టం జరిగిందని షాపు యాజమాని వాసంశెట్టి వరుణ్‌శంకర్ తెలిపారు.

బాధితుడికి ఆర్థిక సాయం

అమలాపురం టౌన్: మధుమేహం కారణంగా రెండు కాళ్లు పోగొట్టుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విశాఖపట్టణానికి చెందిన పురోహితుడు మంగిపూడి రవికుమార్‌కు కోనసీమ బ్రాహ్మణ స్ఫూర్తి ఫౌండేషన్ (కేబీఎస్ఎఫ్) రూ.10 వేల ఆర్థిక సాయం అందించింది. సంస్థ అధ్యక్షుడు అక్కిరాజు రాంబాబు సదరు సాయాన్ని అందించడంతో పాటు ప్రతి నెలా రూ.2 వేల పింఛనుగా ఇస్తామని బాధిత కుటుంబానికి హామీ ఇచ్చారు. మరింతమంది దాతలు రవికుమార్‌ను ఆదుకునేందుకు ముందుకు రావాలని కేబీఎస్ఎఫ్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

తెలుగు సాహితీ సదస్సుకు ఆహ్వానం

యానాం: వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా 30వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 9, 10 తేదీల్లో కాకినాడలో జరిగే అఖిల భారత తెలుగు సాహితీ సదస్సుకు ఆహ్వానం అందిందని పట్టణానికి చెందిన ప్రముఖ కవి డాక్టర్ శిఖామణి మంగళవారం తెలిపారు. సదస్సులో శిఖామణి 'దళిత కవి త్రయం కుసుమ ధర్మన్న, గుర్రం జాషువా, బోయి భీమన్న' అనే అంశంపై ప్రసంగించనున్నట్లు ఆయన చెప్పారు.

జాతీయ పోటీలకు యానాం క్రీడాకారులు


జాతీయ పోటీలకు ఎంపికైన యానాం క్రీడాకారులు

యానాం: బీహార్ రాజధాని పాట్నాలో ఈ నెల 10వ తేదీ నుంచి 14 వరకూ జరిగే 68వ జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు యానాం బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ క్రీడాకారులు పుదుచ్చేరి రాష్ట్రానికి ప్రాతినిథ్యం వహించనున్నారని క్లబ్ కార్యదర్శి కాపగంటి అనురాగ ఆదర్శ శేషసుమన్ మంగళవారం తెలిపారు. బాలుర జట్టుకు చోడే గుణశ్యామ్‌ప్రతాప్, మహ్మద్ జాఫర్‌అలీ, రేవు భార్గవ సాయి ప్రశాంత్, ఎడ్ల రవికుమార్, రుద్రరాజు షణ్ముఖ వెంకటవర్మరాజు, బాలికల తరఫున కాపు అనూష ఎంపికయ్యారన్నారు. వారికి పీఈటీ బొట్టా శ్రీనివాస్ శిక్షణ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను పలువురు అభినందించారు.

సంక్షేమం కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ గెలవాలి

కాట్రేనికోన: ఇంటింటికీ అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని వైఎస్సార్ సీపీ మండల శాఖ కన్వీనర్ నల్లా నరసింహమూర్తి అన్నారు. సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తిల ఆధ్వర్యంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధి వివరాలను తెలియజేశారు. ప్రజల కోసం పనిచేస్తున్న ప్రభుత్వానికి ప్రతిఒక్కరూ అండగా నిలిచి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సంసాని నాగేశ్వరరావు, సానబోయిన


కాట్రేనికోనలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

ఏసు, జగడం బాలయ్య, కోటిపల్లి సత్యారెడ్డి, మల్లి, మోకా చంద్ర నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి


ముమ్మిడివరం: రాబోయే సార్వత్రిక ఎన్నికలు సక్రమంగా, సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు ముమ్మిడివరం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.మధుసూదన్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అనంతరం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ నియోజకవర్గంలో 268 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఉన్న గోగుల్లంక, మాగసాని తిప్ప, హోప్ ఐలాండ్ తదితర గ్రామాల్లో కేంద్రాలను పరిశీలించామన్నారు. ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎంలను ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత స్థానిక ఎంజీఆర్ కళాశాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు తరలిస్తామన్నారు. ఇప్పటికే ఓటింగ్‌పై నియోజకవర్గంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.


ఆర్ఓ మధుసూదన్

నామినేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత బ్యాలెట్ పేపర్ ప్రింట్ చేయించి ఈవీఎంలో నిక్షిప్తం చేస్తామన్నారు. అనంతరం వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో పార్లమెంట్, అసెంబ్లీకి సంబంధించి 27 ఈవీఎంలతో మాక్ పోలింగ్ నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గంలో 268 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఓటింగ్ కోసం ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రకారం 120 శాతం ఈవీఎంలు, 130 శాతం ఈవీ ప్యాడ్‌లు అందుబాటులో ఉంచామని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో పీఓ, ఏపీఓ, నలుగురు ఓపీఓలు, ఒక సచివాలయ ఉద్యోగి ఉంటారన్నారు. సమావేశంలో ఏఆర్ఓ బి.శ్రీనునాయక్ పాల్గొన్నారు.

నేడు లూర్ధుమాత యాత్రా మహోత్సవం

యానాం: స్థానిక రోమన్ కేథలిక్ చర్చి ఆవరణలో ఉన్న లూర్ధుమాత యాత్రా మహోత్సవం బుధవారం నిర్వహించనున్నారు. 1957 నుంచి ఏటా మార్చి 6వ తేదీన పవిత్ర లూర్ధు మాత ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా యానాం పురవీధుల్లో లూర్ధుమాత విగ్రహ ఊరేగింపునకు యానాం, పరిసర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. యాత్రా మహోత్సవాలకు దుగ్గింపూడి బాలశౌరి హాజరు కానున్నారని యానాం ఆర్‌సీఎం ఫాదర్ మరియదాసు తెలిపారు. మతాలకతీతంగా భక్తులు హాజరయ్యే ఈ ఉత్సవాలకు కొండగుహ ఆలయంలో విస్తృత ఏర్పాట్లు చేశామన్నారు. 1943లో యానాంకు సమీపంలోని సాక్రమెంట్


లూర్ధుమాత కొండగుహ ఆలయం

లైట్ హౌస్ వద్ద తీరంలో కూరుకుపోయిన 1000 టన్నుల బరువున్న విలియమ్ బోర్గ్‌స్ ఓడ లూర్ధు మాతను జపమాల ద్వారా ప్రార్థించిన తరువాత తిరిగి సముద్రంలోకి వెళ్లిందని ఆయన చెప్పారు.

పంట కోత ప్రయోగాలతో రైతులకు లబ్ధి

ఉప్పలగుప్తం: ఖరీఫ్, రబీ సీజన్‌లలో నిర్వహించే పంట కోత ప్రయోగాలతో రైతులకు మేలు జరుగుతుందని ముఖ్య ప్రణాళిక అధికారి(సీపీఓ) డి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఏడీఏ ఎంఏ షంషి అధ్యక్షతన ఉప్పలగుప్తం, అల్లవరం, అమలాపురం, అయినవిల్లి మండలాల గ్రామ వ్యవసాయ సహాయకులకు మంగళవారం పంట కోత ప్రయోగంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్న రైతులకు ప్రధానమంత్రి పసల్ బీమా యోజన పథకం ద్వారా ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ప్రతి గ్రామంలోనూ నాలుగు పంట కోత ప్రయోగాలు నిర్వహించి, ఐదేళ్ల సరాసరి దిగుబడి ఆధారంగా క్రాప్ ఇన్సూ



సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్య ప్రణాళిక అధికారి వెంకటేశ్వర్లు

రెన్స్ పరిగణించాలని వీఏఏలకు సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ ఎ.రాజశేఖర్, డీవైఎస్ఓలు ఎ.ప్రభుదాస్, డి.ప్రభాకర్‌రావు, ఏవోలు జి.కుమార్‌బాబు, శోభ పాల్గొన్నారు.

వెంకన్న కల్యాణోత్సవాలపై సమీక్ష


ఉత్సవాలపై అధికారులతో సమావేశమైన ఆర్ఏఓ మునిస్వామి

యానాం: పట్టణంలో కొలువైన శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉత్సవాల నిర్వహణపై మంగళవారం వివిధ శాఖల అధికారులతో ఆర్ఏఓ మునిస్వామి అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. ఈ నెల 11న స్వామివారిని పెండ్లికుమారుడిని చేయడం, సర్ప వాహనం, 12న శేష వాహనం, 13న పుష్పక వాహనం, 14న అశ్వ వాహనం, 15న సూర్య వాహనం, 16న గజ వాహనం, 17న పంచముఖ ఆంజనేయ వాహనం, 18న సింహ వాహనం, 19న హంస వాహనం, 20న గరుడ వాహనం, 21న కల్యాణోత్సవం, 22న పొన్న వాహనం, 23న రథోత్సవం, 24న చక్రస్నానం, 25 నుంచి 27 వరకు పుష్పయాగాలు, 29 నుంచి కొఠాయి ఉత్సవాలు నిర్వహించనున్నట్లుగా తెలిపారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం సాకారం

- ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి
- పేరూరులో ప్రభుత్వ భవనాల ప్రారంభం

అమలాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారమైందని ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అన్నారు. మంగళవారం రూరల్ పరిధిలోని పేరూరు గ్రామంలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నరేగా, వ్యవసాయ, వైద్యారోగ్య శాఖ నిధులు రూ.88.34 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన వికేంద్రీకరణకు పెద్దపీట వేసి జిల్లాల విభజన అనంతరం ప్రజల ముంగిటకే సేవలందించేలా ప్రతి 2000 మంది జనాభాకు ఒక గ్రామ సచివాలయాన్ని తీసుకొచ్చిందన్నారు. రైతు సంక్షేమాన్ని కాంక్షించి విత్తనం నుంచి పండించిన పంట విక్రయం వరకూ చేదోడువాదోడుగా ఉండేందుకు రైతు భరోసా కేంద్రాలను అందుబాటులో తెచ్చిందన్నారు. ఆరోగ్యకర సమాజ స్థాపన దిశగా ప్రజల ముంగిటే వైద్య సేవలు అందించే దిశగా


పేరూరులో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, మంత్రి విశ్వరూప్, ఎంపీ బోస్ తదితరులు

వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు నెలకొల్పామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివక్షకు తావు లేకుండా అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల ఇంటి ముంగిటకే అందుతున్నాయన్నారు. భవనాలను నిర్మించేందుకు స్థలాన్ని ఉచితంగా అందించిన ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరరావులను ఎంపీ మిథున్‌రెడ్డి, మంత్రి విశ్వరూప్‌లు అభినందించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్ర మణి, వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, రాష్ట్ర బ్రహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, సర్పంచ్ దాసరి అరుణ, డాక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వలస కార్మికుడి అనుమానాస్పద మృతి

అమలాపురం రూరల్: మండలంలోని తాండవపల్లిల్లో ఆక్వా చెరువుల వద్ద పనిచేసే ఒడిశాకు చెందిన వలస కార్మికుడు సందీప్ కట్వా(23) అనుమానాస్పదంగా మృతి చెందాడు. తాలూకా ఎస్ఐ శేఖర్ బాబు తెలిపిన వివరాల ప్రకారం సందీప్ గత నెల 28న నలుగురు యువకులతో కలిసి చెరువుల వద్ద పనిచేయడానికి వచ్చాడు. అదే రోజు రాత్రి ఇక్కడ భయంగా ఉందని, తెల్లవారాక తన ఇంటికి వెళ్లిపోతానని మిగిలిన వారితో చెప్పాడు. ఉదయం అతడు కనబడకపోయేసరికి స్వగ్రామానికి వెళ్లిపోయాడేమోనని భావించారు. అయితే మంగళవారం చెరువుల సమీపంలో సందీప్ మృతదేహం కనిపించడంతో చెరువుల యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు అన్ని కోణాల్లో విచారణ జరిపి వలస కార్మికుడి మృతికి కారణాలు వెలికి తీయాలని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. కార్మికుడి మరణానికి ఆక్వా చెరువు యజమానే బాధ్యత వహించాలన్నారు. యువకుడి మరణంపై గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పేదలకు సాయం పంపిణీ

సఖినేటిపల్లి: రామేశ్వరం విలేజ్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యాన మంగళవారం గ్రామ పంచాయతీ వద్ద నిర్వాహకులు 100 మంది పేదలకు సాయం పంపిణీ చేశారు. ఒక్కొక్కరికీ రూ.100 నగదు, 5 కేజీల బియ్యం చొప్పున అందజేశారు. కాగా దాతలు సాయంతో ప్రతి నెలా ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు ట్రస్ట్ ఫౌండర్ సరెళ్ళ విజయ్ ప్రసాద్ తెలిపారు. ఈ నెలకు గాను సేవా కార్యక్రమాలకు గ్రామ సర్పంచ్ కట్టా ఉమామహేశ్వరరావు రూ.20 వేలు విరాళంగా అందజేశారన్నారు. అసోసియేషన్ సభ్యులు ఏ.మధురాజు, బళ్ల లక్ష్మణ్ పాల్గొన్నారు.

శివరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం వృద్ధగౌతమి నదీపాయలో శివరాత్రి మహోత్సవాల సందర్భంగా వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు తొత్తరమూడి సర్పంచ్, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలు వారా జయసావిత్ర ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. నదీపాయ ఇరువైపులా గట్టు ఏర్పాటు చేసి ఇంజిన్ల సాయంతో నీటిని తోడుతున్నారు. నదీ పాయ వెంబడి ఉన్న పరిసరాలను పంచాయతీ సిబ్బంది పొక్లెయిన్, కూలీలతో శుభ్రం చేయిస్తున్నారు. అలాగే మహిళలు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా టెంట్లతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పిండప్రదానాలు, మూసివాయనాలు వంటివి నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.